# పదనిష్పాదన కళ (14)

## The joy of coining new words!

తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం



**భాషాశాస్త్రం:** పదనిష్పాదన కళ (14)

**రచన:** తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఆగస్టు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3261

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

దీని ముందుభాగం

## IV. సమష్టి నామవాచకాలు (Collective Nouns)

### 1. సమాసరూపంలో నిష్పాదన

(అ) సమష్టినామవాచకాల్ని లాక్షణికంగా రూపొందించే పద్ధతేదీ తెలుగులో లేదు. కానీ 'గుంపు/ సంఘాతం' అని అర్థ మిచ్చే *'గమి, గుమి, వరుస, కూటం, కూటువ, తుటుము, దండు, పిండు, కుప్ప, ప్రోవు, దొంతర, కట్ట'* వంటి సమాస అవయవాల్ని నామవాచకానికి చేర్చడం ద్వారా ఈ విధమైన రూపాల్ని కల్పించవచ్చు. ఇది నేను సూచిస్తున్న కొత్తపద్ధతి. పూర్వులైతే వీటిని బహువచన ఔపవిభక్తికానికే చేర్చేవారు. **ఉదాహరణకి –** *ఒప్పుల కుప్ప, గుణముల ప్రోవు* ఇత్యాది. మన నవీన పద్ధతిలో– *పల్లెగమి, మ్రాకువరుస, రైతుకూటం, పిట్టకూటువ, దొంగతుటుము, చీమదండు* ఇత్యాదుల్ని కల్పించవచ్చు.

**(ఆ) సంస్కృతంలో సముదాయార్థంలో చాలా పదాలున్నాయి. వాటిని సమాసావయవాలుగా నామవాచకానికి చేర్చడం ద్వారా ఈ విధమైన రూపాల్ని నిష్పాదించవచ్చు.** ఉదాహరణకి,

*రెండు (ఇద్దఱు) కలిసిన ఉన్న జంట = యుగం, యుగళం, యుగ్మం, ద్వయం, ద్వంద్వం*

*జంటగా కలిసి ఉన్న స్త్రీపురుష మానవులు గానీ, దేవతలు గానీ, పశుపక్ష్యాదులు గానీ = మిథునం*

*మూడు (ముగ్గుఱు) కలిసి ఉన్నప్పుడు = త్రయం, త్రితయం*

*నాలుగు (నలుగుఱు) కలిసి ఉన్నప్పుడు = చతుష్టయం, చతుష్కం*

*ఐదు (ఐదుగుఱు) = పంచకం*

*ఆఱు (ఆఱుగుఱు) = షట్కం*

*ఏడు (ఏడుగుఱు) = సప్తకం*

*ఎనిమిది (ఎనమండుగుఱు) = అష్టకం*

*తొమ్మిది (తొమ్మండుగుఱు) = నవకం*

*పది (పదుగుఱు) = దశకం*

*వంద (వందమంది) = శతకం*

*వెయ్యి (వెయ్యిమంది) = సహస్రకం*

**(ఇ) ఇతర సముదాయార్థకాలు :** *జనం, సంఘం, సమాజం, సమూహం, సందోహం, విసరం, వ్రజం, స్తోమం, ఓఘం, నికరం, వ్రాతం, సంఘాతం, చయం, సంచయం, సముదయం, సమవాయం, నికాయం, నివహం, గణం, సంహతి, బృందం, నికురుంబం, కదంబం, వితానం, ప్రకరం, మండలం, చక్రం, చక్రవాళం, పటలం, జాలం, వర్గం. శ్రేణి*

**కుప్ప –** *రాశి, ఉత్కరం, కూటం, పుంజం.*

***వరుస –*** *ఆళి, ఆవళి, రేఖ, పంక్తి*

2. లాక్షణిక నిష్పాదన

**(అ) పదాది అచ్చుకు వృద్ధిని ఆదేశించి, పదాంతంలో** 'య' **ప్రత్యయం చేర్చడం ద్వారా సంస్కృతంలో సమూహా ర్థకాల్ని ఏర్పఱుస్తారు.** ఉదాహరణకి,

*బ్రాహ్మణుడు –> బ్రాహ్మణ్యం = బ్రాహ్మణుల గుంపు*

*సమానులు –> సామాన్యం = సమానుల గుంపు*

*జ్యోతిస్ –> జ్యౌతిష్యం = వెలుగుల పుంజం*

**(ఆ) కొన్నిసార్లు పదాదిన వృద్ధినీ, పదాంతంలో** 'క' **ప్రత్యయాన్నీ చేర్చడం ద్వారా సమూహార్థకాల్ని ఏర్పఱుస్తారు.**

ఉదాహరణకి,

*రాజు –> రాజకం = రాజుల సమూహం*

*దేవత –> దైవతకం = దేవతల సమూహం*

*నటుడు –> నాటకం = నటుల సమూహం*

**(ఇ) కొన్నిసార్లు నామవాచకానికి** 'త' **లేదా** 'త్వం' **చేర్చడం ద్వారా సమూహార్థకాల్ని ఏర్పఱుస్తారు.** ఉదాహరణకి,

*జనం + త = జనత (జనాల సమూహం)*

*ప్రభువు + త = ప్రభుత (ప్రభువుల సమూహం)*

*ప్రభువు + త్వం = ప్రభుత్వం (ప్రభువుల సమూహం)*

## V. అమూర్త నామవాచకాలు (Abstract Nouns)

గుణగణాలూ, లక్షణాలూ, మనోభావాలూ, సంబంధాలూ : **(అ) తెలుగులో వీటిని సూచించడానికి** 'తనం, ఱికం / అఱికం' **అనే ప్రత్యయాల్ని చేఱుస్తారు. వీటిని నామవాచకాలకైనా చేర్చవచ్చు. విశేషణాలకైనా చేర్చవచ్చు.** ఉదా :-

*పిఱికి + తనం = పిఱికితనం*

*మొండి + తనం = మొండితనం*

*సోమరి + తనం = సోమరితనం*

*హుందా + తనం = హుందాతనం*

*చిన్న + తనం = చిన్నతనం*

*పెద్ద + ఱికం = పెద్దఱికం*

*పేద + ఱికం = పేదఱికం*

*మేన + ఱికం = మేనఱికం*

*కోడటి + ఱికం = కోడంట్రికం*

*రాజు + అఱికం = రాజఱికం*

*నేస్తు + అఱికం = నేస్తఱికం*

*దాపు + అఱికం = దాపఱికం*

**(ఆ) కొన్నిసార్లు** 'తనం' **అనే ప్రత్యయాన్ని సమూహార్థంలో కూడా ఉపయోగిస్తారు.** ఉదాహరణకి, *దొరతనం = దొరల సమూహం (ప్రభుత్వం).*

**(ఇ)** సంస్కృతంలో వీటిని సూచించడానికి నామవాచకంలో చేసే మార్పులు సముదాయార్థకాల్లాగానే ఉంటాయి. అంటే, **పదాది అచ్చుకు వృద్ధిని ఆదేశించి, పదాంతంలో** 'య' **ప్రత్యయం చేర్చడం ద్వారా సంస్కృతంలో గుణార్థకాల్నీ, భావార్థకాల్నీ ఏర్పఱుస్తారు.** ఉదాహరణకి,

*అధిక –> ఆధిక్యం = అధికంగా ఉన్నదాని స్థితి*

*అధిపతి -> ఆధిపత్యం = అధిపతి యొక్క స్థితి / భావం*

*పండిత -> పాండిత్యం = పండితుని స్థితి / భావం*

*లలిత -> లాలిత్యం = లలితుని స్థితి*

*కవి -> కావ్యం = కవి యొక్క భావం*

*స + హిత -> సాహిత్యం = హితం (శ్రేయస్సు) గలదాని స్థితి*

*చపల -> చాపల్యం = చంచలుడి స్థితి*

*విదుష్ -> వైదుష్యం = విద్వాంసుడి స్థితి*

*వికల -> వైకల్యం = వికలం (లుప్తం) అయినదాని స్థితి*

*వివిధ -> వైవిధ్యం = వివిధాలైన స్థితి*

*ఈశ్వర -> ఐశ్వర్యం = యజమానుడి స్థితి*

*దీన -> దైన్యం = దీనుడి స్థితి*

*క్రూర -> క్రౌర్యం = క్రూరుడి భావం*

*దూత -> దౌత్యం = దూత యొక్క స్థితి*

*ఏక -> ఐక్యం = ఒక్కటిగా ఉన్నవారి స్థితి / భావం*

**(ఈ) భావార్థంలో ఉకారాంత నామవాచకాలకు కొన్నిసార్లు పదాదిన వృద్ధి తరువాత పదాంతంలో** 'య' **ప్రత్యయానికి బదులు** 'అ' **ప్రత్యయాన్ని చేఌుస్తారు.** ఉదాహరణకి,

*లఘు -> లాఘవం = తేలికగా ఉన్నదాని స్థితి*

*శత్రు -> శాత్రవం = శత్రువు యొక్క భావం*

*విభు -> వైభవం = సంపన్నుడి స్థితి*

*గురు -> గౌరవం = గురువు యొక్క స్థితి / భావం*

*సుష్ఠు -> సౌష్ఠవం = సుష్ఠువుగా ఉన్న స్థితి*

*ఋతు -> ఆర్తవం = ఋతువు యొక్క స్థితి*

*మృదు -> మార్దవం = మృదువుగా ఉన్నదాని స్థితి*

*శిశు -> శైశవం = శిశువుగా ఉన్నప్పటి స్థితి (పసితనం)*

**(ఉ) కొన్నిసార్లు భావార్థంలో నామవాచకాలకు కొన్నిసార్లు పదాదిన వృద్ధి మాత్రమే చేఱుస్తారు.** ఉదాహరణకి,

*సురభి –> సౌరభం*

*పురుష –> పౌరుషం*

*వస్తు –> వాస్తవం*

*కుశలం –> కౌశలం*

**(ఊ) పదనిర్మాణంలో మార్పులేమీ చేయకుండా సులభంగా భావార్థకాల్ని కల్పించాలంటే, పదానికి** 'త్వం' **లేదా**

'త' **అనే ప్రత్యయాల్ని చేర్చాలి.** ఇవి తెలుగులోని 'తనం, ఱికం' లాంటివాటికి సమానం. ఈ ప్రత్యయాల్ని నామవాచకాల కైనా చేర్చవచ్చు, విశేషణాలకైనా చేర్చవచ్చు. ఉదాహరణకి,

***మహాన్ –*** *మహత్ + త్వం –> మహత్త్వం = గొప్పతనం*

***వేధస్ –*** *వేధస్ + త్వం –> వేధస్త్వం = బ్రహ్మపదవి*

***దేవుడు –*** *దేవ + త్వం –> దేవత్వం*

***రాజు –*** *రాజ + త్వం –> రాజత్వం*

***భర్త –*** *భర్తృ + త్వం –> భర్తృత్వం*

***భార్య –*** *భార్యా + త్వం –> భార్యాత్వం*

***ముని –*** *ముని + త్వం –> మునిత్వం*

***శిశువు –*** *శిశు + త్వం –> శిశుత్వం*

## తెలుగు క్రియాధాతువుల భావార్థకాలు

క్రియాధాతువుల నుంచి నిష్పన్నమయ్యే నామవాచకాలు. ఉదాహరణకి,

*పోవు –> పోక*

*వచ్చు –> రాక*

*ఉండు –> ఉనికి*

*చచ్చు -> చావు*

*ఇచ్చు -> ఈవి*

*నడచు -> నడక*

*పడచు -> పడక*

*ఈదు -> ఈత*

*కఱచు -> కాటు*

*పొడుచు -> పోటు*

*చెరుగు -> చేట*

*కొను -> కోలు* ఇత్యాదులు.

పైన చూపినవి అపక్రమ రూపాలు (irreular forms). అంటే వాటిని ఉన్నవి ఉన్నట్లుగా స్వీకరించి ప్రయోగించడమే తప్ప ఒక సూత్రం ప్రకారం అర్థం చేసుకోవడం కుదరదు. అలా కాకుండా, ఎక్కువశాతం క్రియాధాతువులకి కొన్ని నియమాలకి

లోబడి వ్యాకరణబద్ధంగా సక్రమమైన భావార్థకాల్ని సాధించను అవకాశముంది.

**(అ) యుకార, చుకారాలతో అంతమయ్యే క్రియాధాతువుల తుది వర్ణానికి** '-పు' **లేదా** 'ఉపు' **ని ఆదేశించడం ద్వారా భావార్థకాల్ని నిష్పాదిస్తారు.** ఉదాహరణకి-

*మెఱయు -> మెఱుపు*

*బలియు -> బలుపు*

*ఒడియు -> ఒడుపు*

*జడియు -> జడుపు*

*మఱచు -> మఱుపు*

*విఱచు -> విఱుపు*

*పఱచు -> పఱుపు*

*తలచు -> తలపు*

*మాయు -> మాపు*

**(ఆ) ఈ కోవకు చెందిన ధాతువులకే కొన్నిసార్లు** ‘త’ **వర్ణకం ఆదేశమవుతుంది.** ఉదాహరణకి,

*మేయు –> మేత*

*కాయు –> కాత*

*పూయు –> పూత*

*నేయు –> నేత*

*వేయు –> వేత*

*కోయు –> కోత*

*వ్రాయు –> వ్రాత*

*తీయు –> తీత*

*చేయు –> చేత*

*మ్రోయు –> మోత*

*మూయు –> మూత*

*ఊోయు –> ఊోత*

**(ఇ)** ‘ఇంచుక్’ **తో అంతమయ్యే క్రియాధాతువుల తుది** ‘చు’ **కారానికి భావార్థంలో** ’పు’ **వర్ణకం ఆదేశమవుతుంది.** ఉదాహరణకి,

*ఊరేగించు –> ఊరేగింపు*

*జోడించు –> జోడింపు*

*ఏవగించు –> ఏవగింపు*

*ఊఱడించు –> ఊఱడింపు*

*సడలించు –> సడలింపు*

*మళ్ళించు –> మళ్ళింపు*

**(ఈ)** ‘ఇంచుక్’ **తో అంతమయ్యే కొన్ని క్రియాధాతువుల** ‘చు’ **కారానికి భావార్థంలో** ‘త’ **వర్ణకం ఆదేశమవుతుంది.**

ఉదాహరణకి,

*అప్పగించు -> అప్పగింత*

*కలవరించు -> కలవరింత*

*పలవరించు -> పలవరింత*

*కేరించు -> కేరింత*

**(ఉ) కొన్ని క్రియాధాతువులకి భావార్థంలో** 'దు' **వర్ణకం చేఱుతుంది.** ఈ రూపాల్ని నామవాచకాలుగానే కాక కొన్నిసార్లు విశేషణాలుగా కూడా ప్రయోగిస్తారు. ఉదాహరణకి,

*రుద్దు -> రుద్దుడు*

*దించు -> దింపుడు*

*బాదు -> బాదుడు*

*గిచ్చు -> గిచ్చుడు*

*వాగు -> వాగుడు*

*తాగు -> తాగుడు*

*నంజు -> నంజుడు*

**(ఊ) కొన్ని భావార్థకాల** 'దు' **వర్ణకం కాలక్రమంలో** 'డి/ ఇడి' **వర్ణకంగా మారినట్లు గోచరిస్తుంది.** ఉదాహరణకి–

*తిను -> తినుడు -> తినిడి -> తిండి*

*దోచు -> దోపుడు -> దోపిడి*

*మార్చు-> మార్పుడు -> మార్పిడి*

*కట్టు -> కట్టుడు -> కట్టడి*

రాచుడు ->రాయిడి ఇత్యాది.

**(ఋ)** 'గు/ చు' **వర్ణకాలతో అంతమయ్యే కొన్ని క్రియాధాతువుల** 'గు/ చు' **కారాలకి భావార్థంలో** 'కువ' **ప్రత్యయం ఆదేశమవుతుంది.** ఉదాహరణకి–

*ఎఱుగు -> ఎఱుకువ = చైతన్యం*

మఱచు -> మఱకువ = అజ్ఞానం

అణగు -> అణకువ = వినయం

తెఱచు -> తెఱకువ = స్పష్టత

పొలచు -> పొలకువ = జాడ (కనిపించడం)

మెలగు -> మెలకువ = మేల్కొని ఉండడం

**(ఋ) 'గు' వర్ణకంతో అంతమయ్యే కొన్ని క్రియాధాతువుల 'గు' కారానికి భావార్థంలో 'క' ప్రత్యయం ఆదేశమవుతుంది.** ఉదాహరణకి–

మునుగు -> మునక

కడఁగు (ప్రయత్నించు) -> కడఁక

అలుగు -> అలక

మసగు (దట్టమగు, వ్యాపించు) → మసక

తొలగు -> తొలక -> తొక్క

**(ఎ) కొన్ని క్రియాధాతువులకు భావార్థంలో 'ఇక' ప్రత్యయం చేఱుతుంది.** ఉదాహరణకి,

అందు -> అందిక

పొందు -> పొందిక

అమఱు -> అమఱిక

బడలు -> బడలిక

చీలు -> చీలిక

తేలు -> తేలిక

పోలు -> పోలిక

పూను -> పూనిక

చాలు -> చాలిక

అల్లు -> అల్లిక

తీఱు -> తీఱిక

*ఆడు (తిట్టు) –> ఆడిక*

*వాడు –> వాడిక –>వాడుక)*

**(ఏ) కొన్ని క్రియాధాతువులకు భావార్థంలో** 'అకం' **ప్రత్యయం చేఱుతుంది.** ఉదాహరణకి,

*అద్దు –> అద్దకం*

*అమ్ము –> అమ్మకం*

*అల్లు –> అల్లకం*

*పాఱు –> పాఱకం (పాఱుదల)*

*పెట్టు –> పెట్టకం (పెటకం)*

*మారు –> మారకం*

**(ఐ)** 'డు' కారంతో **అంతమయ్యే కొన్ని క్రియాధాతువుల అంత్య** 'డు' **కారానికి భావార్థంలో 'ట' వర్ణం గానీ,** 'టు' **వర్ణంగానీ ఆదేశమవుతుంది.** ఉదాహరణకి,

*ఆడు –> ఆట*

*పాడు –> పాట*

*పండు –> పంట*

*వండు –> వంట*

*ఎండు –> ఎంట (ఎండ)*

*పడు –> పాటు*

*చెడు –> చేటు*

*ఓడు –> ఓటు (ఓటమి)*

*వీడు –> వీటు (భాగం)*

*కూడు –> కూట (కూటం, కూటమి)*

**గమనిక :– 'ఆట'** అనే భావార్థక రూపాన్ని వేఱే పదాలతో సమాసించినప్పుడు కొన్నిసార్లు 'ఆటం' గా మారుతుంది. ఉదాహ రణకి, పోరాటం ఇత్యాది.

**(ఒ) కొన్ని క్రియాధాతువులకి భావార్థంలో** ‘కడ’ **ప్రత్యయం గానీ,** ’దల’ **ప్రత్యయం గానీ,** ‘బడి’ **ప్రత్యయం గానీ,** ‘పాటు’ **ప్రత్యయం గానీ చేఱుతుంది.** ఉదాహరణకి,

*తీఱు + కడ –> తీఱుగడ*

*చేఱు + కడ –> చేఱుగడ*

*వచ్చు + కడ –> రాకడ*

*పోవు + కడ –> పోకడ*

*పాఱు + దల –> పాఱుదల*

*విడు + దల –> విడుదల*

*ఎదుగు + దల –> ఎదుగుదల*

*పట్టు + దల –> పట్టుదల*

*కట్టు + బడి –> కట్టుబడి*

*చేదు + బడి –> చేదుబడి (చేతబడి)*

*పలుకు + బడి –> పలుకుబడి*

*వచ్చు + బడి –> రాబడి*

*పెట్టు + బడి = పెట్టుబడి*

*దిగు + బడి –> దిగుబడి*

*తీఱు + బడి –> తీఱుబడి*

*అందు + పాటు –> అందుబాటు*

*అచ్చు + పాటు –> అచ్చుబాటు*

*ఎడయు + పాటు –> ఎడబాటు*

*దిద్దు + పాటు –> దిద్దుబాటు*

*నగు + పాటు –> నగుబాటు*

*కట్టు + పాటు –> కట్టుబాటు*

*జఱుగు + పాటు –> జఱుగుబాటు (maintenance)*

*క్రుంగు + పాటు -> క్రుంగుబాటు (depression)*

**గమనిక :-** కర్మార్థక క్రియల (passive voice forms) ని నామవాచకాలుగా మార్చుకోవడానికి, ఆ రకంగా కొత్త అర్థాల లో కొత్తపదాల్ని కల్పించడానికీ ఈ తెఱగు నిర్మాణాల్ని ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకి,

*కనబడు -> కనబాటు = దృశ్యం, చూసే వీలు*

*వినబడు -> వినబాటు = శ్రవ్యం, వినే వీలు*

*కాబడు -> కాబాటు = సంఘటన, అయ్యే వీలు*

*పోబడు -> పోబాటు = గమ్యం, పోయే వీలు*

*ఆధారపడు -> ఆధారపాటు = ఆశ్రితత్వం (Dependence)*

(ఓ) **'జఱిగిన/ చేసిన సంఘటన' అనే అర్థంలో క్రియాధాతువులకి** 'ఇమి' **ప్రత్యయం చేఱుతుంది.** ఉదాహరణకి,

*తాళు -> తాళిమి = ఓర్పు*

*పోవు -> పోయిమి = పోయిన సంఘటన*

*తెలుపు -> తెలిపిమి = తెలిపిన వాస్తవం*

*అను -> అనిమి = అన్న సమాచారం*

*ఎక్కు -> ఎక్కిమి = ఎక్కిన (ప్రభుపదవిని అధిష్ఠించిన) సంఘటన*

(ఎకిమీడు = రాజు)

**గమనిక :-** 'ఇమి' ప్రత్యయం చేఱినప్పుడు కొన్ని ధాతువుల చివఱ ఉండే 'గు, యు, చు' వర్ణకాలు లోపించవచ్చు. ఉదాహరణకి,

*కలుగు -> కలిమి*

*బలియు -> బలిమి*

*ఓర్చు -> ఓఱిమి*

*కూర్చు -> కూఱిమి (ప్రేమ)*

*జఱుగు -> జఱిమి (చరిత్ర)*

*నేర్పు -> నేఱిమి (విద్య)*

**(ఔ) ‘జఱగని/ చేయని వాస్తవం’ అనే అర్థంలో క్రియాధాతువులకి** ‘అమి’ **ప్రత్యయం చేఱుతుంది.** ఉదాహరణకి,

*పోవు + అమి = పోవమి -> పోమి (పోకపోవడం)*

*లే + అమి = లేమి (లేకపోవడం)*

*కా + అమి = కామి (కాకపోవడం)*

*రా + అమి = రామి (రాకపోవడం)*

*జఱుగు + అమి = జఱుగమి -> జఱగమి (జఱక్కపోవడం)*

*తిను + అమి = తినమి (తినకపోవడం)*

**(క) కొన్ని క్రియాధాతువుల తుది ’రు’ వర్ణానికి భావార్థకంలో ’ట’ వర్ణకం ఆదేశమవుతుంది.** ఉదాహరణకి,

వనఱు -> వనట *(ఆయాసం)*

తివురు -> తివుట *(కోరిక)*

తీఱు -> తీట

తేఱు -> తేట

వేసఱు -> వేసట *(విసుగు ; తెలంగాణలో ’యాష్ట’ అంటారు)*

మారు -> మాట

పేఱు -> పేట

ఊఱు -> ఊట

పాఱు -> పాట -> బాట

పోరు -> పోట -> పోటి

**(ఖ) కొన్నిటికి భావార్థంలో ఏమీ చేఱదు.** ఉదాహరణకి,

*తిట్టు, పట్టు, దూఱు, తన్ను, నాటు, దాటు, గెంతు, కుళ్ళు, పుచ్చు, హెచ్చు, తగ్గు, మొగ్గు, తఱుగు, విఱుగు, తూగు, కప్పు, దెప్పు* ఇత్యాది.

సంస్కృత క్రియాధాతువుల భావార్థకాలు

**వీటిని 13 వ అధ్యాయంలో విపులంగా ఇవ్వడం జరిగింది.**

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com